క్లుప్తంగా

ఎమ్మెల్యే కాసు సంక్రాంతి శుభాకాంక్షలు



పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరు స్నేహభావంతో కలిసి మెలిసి ఉండాలని, వారి పనుల్లో అభివృద్ధి జరగాలని ఆయన ఆకాంక్షించారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఘనంగా నిర్వహించుకోవాలని పిండి వంటలు, చుట్టాలతో లోగిళ్లన్నీ కళకళలాడాలని తెలిపారు.

రోడ్డు పునఃనిర్మాణ పనులు ప్రారంభం



కారెంపూడి: కారెంపూడిలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. స్థానిక ఇందిరా నగర్ కాలనీ నుంచి బస్టాండ్ సెంటర్‌లోని పోలీస్ కాంప్లెక్స్ వరకు దెబ్బతిన్న రోడ్డు బీటీ లేయర్‌ను తొలగించి, రోడ్డును చదును చేశారు. దానిపై మెటల్ లేయర్‌ను పరచి చదును చేస్తున్నారు. దీంతో కారెంపూడిలో రోడ్డుపై లేస్తున్న దుమ్ము సమస్య తీరింది. ఇదిలా ఉంటే నరసరావుపేట నుంచి మాచర్ల వెళ్లే ప్రధాన రహదారిలో మండలంలోని పేటసన్నెగండ్ల బ్రిడ్జి నుంచి నరమాలపాడు గ్రామం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు పునర్నిర్మాణ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు చేయిస్తున్నారు. మొత్తం 9 కిలోమీటర్ల పొడవున్న రోడ్డు పునర్నిర్మాణ పనులు ప్రస్తుతం కారెంపూడిలో జరుగుతున్నాయి. సుమారు రూ.4 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణం జరగనుందని, మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు.

ప్రతి ఇంటికి అక్షింతలు



దుర్గి: శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు వారి నుంచి అందుకున్న పవిత్ర అక్షింతల వితరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆత్మకూరు గ్రామంలో స్థానిక గ్రామ పెద్దలు హిందూ బంధువులు విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో మాచర్ల మెయిన్ రోడ్డులోని కాశి నాయన ఆశ్రమం నుంచి రామాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అక్షింతలను గ్రామంలో ప్రతి ఇంటికి అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ బొబ్బ సీతారామిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వరహాల రెడ్డి, లింగయ్య, అంబారావు, సత్యనారాయణ, లక్ష్మయ్య, నరసింహారావు, చెన్న కేశవులు, అప్పారావు, రాయపరెడ్డి, చెంచారావు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా

రెంటచింతల: సంక్రాంతి పండుగ వేడుకలలో భాగంగా ఆదివారం భోగి సందర్భంగా స్థానిక ఉట్ల స్తంభాల సెంటర్లో శ్రీ రామకృష్ణ సేవా మండలి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన స్లో సైకిల్, కప్పగంతులు, కుందుల పోటీలలో బాలబాలికలు ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. పోటీలలోని విజేతలకు బహుమతులను సేవామండలి సంస్థ సభ్యులు కాశిరెడ్డి, రాముడు, పెదబాబు, శివ అందజేసి పోటీలను పర్యవేక్షించారు. మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో భోగి పండుగను పురస్కరించుకుని క్రికెట్ క్రీడాకారుడు మూఢావత్ కృష్ణనాయక్ జ్ఞాపకార్థం నాయక్‌యూత్ ఆధ్వర్యంలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ ఆటల పోటీలను మూఢావత్ గోవింద్‌నాయక్, శంకర్ నాయక్‌లు నిర్వహించి విజేతలకు బహుమతులను అందచేశారు.

వాహనాల తనిఖీ



గురజాల : అక్రమంగా మద్యం, నగదు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఎస్‌ఐ జయరాం, సివిల్ ఎస్‌ఐ అశోక్‌ల ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. దాచేపల్లి నుంచి మాచర్ల వెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐలు మాట్లాడుతూ అక్రమంగా తెలంగాణ మద్యం, సరైన ఆధారాలు లేకుండా డబ్బులు తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీ చేయడం జరిగిందన్నారు.

గ్రామగ్రామాన భోగి పండుగ సందడి

- వీధివీధిన సందడిగా భోగి మంటలు
- సంప్రదాయం వెల్లివిరిసేలా హరిదాసుల సందడి



భోగి మంటలు వద్ద గ్రామస్తులు



పాలువాయి గ్రామంలో వేస్తున్న భోగి మంటలు



రంగులతో తీర్చిదిద్దిన ముగ్గులో గొబ్బెమ్మ



పిడుగురాళ్ల పట్టణంలో భోగి మంటల వద్ద చలి కాగుతున్న స్థానికులు



భోగి పండుగ వేడుకలలో విజయపురిసౌత్ గ్రామస్తులు



హరిదాసుకు దానం చేస్తున్న చిన్నారి

పిడుగురాళ్లరూరల్: భోగి పండుగను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం భోగి మంటలు వేశారు. ఇళ్లలోని పనికిరాని పాత వస్తువులను భోగి మంటల్లో వేయడం ద్వారా కొత్తవి వారి జీవితాలలోకి వస్తాయని ప్రజల విశ్వాసం. మహిళలు భోగి మంటల చుట్టూ ఆడుతూ నృత్యాలు చేశారు.

అగ్ని దేవుని ఆరాధనే భోగి మంటలు

రెంటచింతల: అగ్ని దేవునికి ఆరాధనే భోగి మంటలని పురాణాల ద్వారా తెలుస్తుందని మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు వడ్డమాను రమణాచార్యులు అన్నారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలలో తెల్లవారుజామున ఇళ్ల ముందు పిల్లలు, యువకులు, వృద్ధులు అనే తారతమ్యం లేకుండా అందరూ కలిసి భోగి మంటలు వేశారు. నివాసాల ముందు రంగులతో ముగ్గులు వేసి పేడగొబ్బెమ్మలు పెట్టి పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా అర్చకులు రమణాచార్యులు మాట్లాడుతూ తెలుగువారి పెద్ద పండుగ అయిన సంక్రాంతి సంబరాలు మొదటి రోజు భోగి పండుగతో ప్రారంభమవుతాయన్నారు.

సందడిగా భోగి పండుగ

గురజాల : పల్లెల్లో భోగి మంటలు ఎగసిపడ్డాయి. సంక్రాంతి ముందు రోజు వచ్చే భోగి సందర్భంగా గ్రామాలకు ఎక్కడెక్కడో ఉన్న వారంతా సొంతూళ్లకు చేరడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. నియోజకవర్గ వ్యాప్తంగా భోగి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచే భోగి మంటలు వేస్తూ సందడి చేశారు. మహిళలు తమ లోగిళ్ల ముందు ముగ్గులు వేసి రంగులతో తీర్చిదిద్దారు. భోగభాగ్యాలతో సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పిడుగురాళ్లలో భోగి వేడుకలు

పిడుగురాళ్ల: పట్టణంలో భోగి వేడుకలు ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయాన్నే ఇంటి ముందు భోగి మంటలు వేసి చిన్న పెద్దా అంతా సందడి చేశారు. పట్టణంలోని కనక దుర్గమ్మ, వాసవీ అమ్మవారు, నాగుల గుడి దేవస్థానం, శివాలయం ఇలా పలు దేవాయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భోగి మంటల వద్ద సందడి

విజయపురిసౌత్: భోగి వేడుకలు విజయపురిసౌత్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ఇంటింటా భోగి మంటలు వేసి స్థానికులు సందడి చేశారు. బంధువులు, స్నేహితుల ఆట పాటలతో భోగి పండుగ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. విజయపురిసౌత్‌లోని పలు కూడళ్లలో వేసిన సంక్రాంతి ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మాచవరంలో భోగి వేడుకలు

మాచవరం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి పండుగ వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామున భోగి మంటలు వేసి ఆనందంగా గడిపారు. బంధుమిత్రుల రాకతో గ్రామాల్లో సందడి నెలకొంది. హరిదాసులు భక్తి గీతాలు ఆలపిస్తూ, గడప గడపకు దీవెనలు అందించారు. ప్రతి ఇంటా రంగులతో ముగ్గులు గొబ్బెమ్మలతో అలంకరణలు బాగా ఆకట్టుకున్నాయి. పలు చోట్ల ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

సంక్రాంతి ప్రతి ఇంటా సిరులు నింపాలి

జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి



విజయపురిసౌత్: సంక్రాంతి ప్రతి ఇంటా సిరులు నింపాలని పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి అన్నారు. ఆదివారం విజయపురిసౌత్‌లో సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మత్స్యకారులు ఆయనను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో పంటలు బాగా పండి రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జున, గోవిందు, చిట్టి, ఆనంద్, సత్యారావు, శ్రీను, కృష్ణ, రాజేష్, తాతారావు పాల్గొన్నారు .

రేపు ముగ్గుల పోటీలు

మాచర్ల: భోగి, సంక్రాంతి, కనుమ పండుగ పురస్కరించుకొని మాచర్ల పట్టణంలోని పీఆర్కే, పీవీఆర్ నెహ్రూనగర్ యూత్ నేతృత్వంలో భారీ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు కౌన్సిలర్ రామిశెట్టి వెంకటేశ్వర్లు, గట్ల కోటిరెడ్డి, రామాంజిరెడ్డిలు ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ నెల 16వ తేది మంగళవారం నెహ్రూనగర్ 2వలైన్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు హాజరవుతారన్నారు.

పీవీఆర్ కుటుంబ సభ్యుల ప్రత్యేక పూజలు



వెంకటేశ్వర స్వామి ఊరేగింపులో పీవీఆర్ తదితరులు

మాచర్ల: సంక్రాంతి పండుగ సందర్భంగా భోగి ఉత్సవాలు ఆదివారం బస్టాండ్ ప్రాంతంలో వేంచేసియున్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు, యువతులు కోలాటం నిర్వహిస్తూ, దేవుని పాటలతో అలరిస్తూ ఊరేగింపు జరిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, కుటుంబ సభ్యులు, పీఆర్కే తండ్రి వెంకటేశ్వరరెడ్డి దంపతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఆయన కుటుంబ సభ్యులకు ఆశీస్సులందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదినారాయణతో పాటు ఆయా వార్డు కౌన్సిలర్లు పలువురు పాల్గొన్నారు. అంతకుముందు తెల్లవారుజామున మహిళలు వెంకటేశ్వరస్వామికి నగర సంకీర్తన జరిపారు. భక్తులకు ఆలయ ఈవో శ్రీగిరిరాజు నర్సింహబాబు, నిర్వాహకులు వీరాంజనేయరెడ్డి, చుండూరు మల్లిఖార్జునరావుల ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో గట్ల కోటిరెడ్డి, చెన్నకేశవరావు, నాగమయ్య, యరబోతుల విజయలక్ష్మి, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులున్నారు.

ముగ్గుల పోటీలకు విశేష స్పందన



ముగ్గులు వేస్తున్న మహిళలు



బహుమతి అందజేస్తున్న ఎంపీపీ చౌడేశ్వరి

దాచేపల్లి : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 230 మందికిపైగా మహిళలు పాల్గొన్నారు. భోగి, సంక్రాంతి పండుగలు ప్రతిబింబించేలా ముగ్గులు వేశారు. న్యాయనిర్ణేతలుగా డాక్టర్ కనుమూరి విక్రాంత్, గీతారాణి, కావ్యలు వ్యవహరించారు. విజేతలైన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, మార్కెట్‌యార్డు డైరెక్టర్ బుగ్గల జానీ, కౌన్సిలర్లు గురువులు, క్రాంతికుమార్, వెంకటరెడ్డి, వీరారెడ్డి, నాయకులు శ్రీనివాసరావు, సైసావలి, పుల్లారావు పాల్గొన్నారు.

దుర్గిలో ముగ్గుల పోటీలు

దుర్గి: పండుగలు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిరూపమని దుర్గి ఎస్‌ఐ కోటయ్య అన్నారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ళ సందర్భంగా ఆదివారం మండల కేంద్రమైన దుర్గిలో వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణలో ముగ్గుల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను ఆయన అభినందించి మాట్లాడారు. మన సంస్కృతి సంప్రదాయాల గురించి నేటి యువత తెలుసుకోవాలన్నారు. పోటీలకు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్న వెంకటయ్య, నారాయణ, శ్రీనివాసరావు, సత్యం, ఎంపీటీసీ గోపాల్, బీజేపీ మండల కన్వీనర్ శ్రీనివాసరావు, సత్యనారాయణ, యలమంద, గోపాల్, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

మాచర్ల రూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పలు గ్రామాలలో సంక్రాంతి సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున భోగి మంటలు వేసి చిన్నా, పెద్ద కలసి ఆటపాటలు నిర్వహించారు. కొత్తపల్లి, గన్నవరం గ్రామాలలో వైఎస్సార్‌సీపీ పెద్దలు, యూత్ ఆధ్వర్యంలో మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. గన్నవరం గ్రామంలో కందుల రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు రెంటచింతల ఎంపీపీ దాసరి చౌడేశ్వరి ముఖ్య అతిథిగా హాజరై గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు.

కొత్తపల్లిలో..

వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ గ్రామ పెద్దల సహకారంతో గ్రామంలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళ లక్ష్మీదేవికి పట్టుచీరను సర్పంచ్ ఓరుగంటి చిన్నా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం



గోదాదేవి సమేత వేణుగోపాలస్వామి

కారెంపూడి: స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకుల కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు సత్యనారాయణాచార్యులు కల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు ఆవు పిడకలపై నైవేద్యం తయారు చేసి స్వామి వారికి సమర్పించారు. కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రెంటచింతలో గోదాదేవి కల్యాణోత్సవం

రెంటచింతల: ధనుర్మాసం ముగింపు సందర్భంగా మండల కేంద్రమైన రెంటచింతలలో వేంచేసిన వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. ధనుర్మాసం 30రోజులపాటు తెల్లవారు జామున స్నానమాచరించి తిరుప్పావై చదివిన వారికి సమస్తకోరికలు తీరతాయని అర్చకులు తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత డౌన్ మార్కెట్ టీం

విజయపురిసౌత్: స్థానిక జింఖానా గ్రౌండ్‌లో ఓలేటి సురేష్ జ్ఞాపకార్థం భీమవరపు వెంకటరమణ, భవిరి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు ఆదివారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో డౌన్‌మార్కెట్ టీం విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మాచర్ల మండల నాయకుడు బూడిద శ్రీనివాసరావు విజేతగా నిలిచిన డౌన్‌మార్కెట్ టీంకు రూ.10,116 నగదు బహుమతిని అందజేశారు. ట్రోఫీ నిర్వాహకులు ఆయనను అభినందించారు.